# సత్యవాక్కు

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

JUNE -1998

# సంక్షిప్త వార్తలు

1998 ఏప్రియల్ నెల సువార్తికుల సదస్సు 22వ తేదీ బుధవారం నాడు తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం దుళ్ల గ్రామములో ఘనముగా జరిగెను. పలుప్రాంతములనుండి వచ్చిన సువార్తికులతోను, స్థానిక సంఘ సభ్యులతోను దుళ్ల లోని క్రీస్తు సంఘ ఆలయము దాని పరిసర ప్రాంగణం కిటకిటలాడగా, "లేఖనాను సారమైన బాప్తిస్మము యేది ? రక్షింపబడుటకు బాప్తిస్మము అవుసరమా ? " అను అంశము చర్చించబడెను.

సమావేశమును సోదరులు జాషువా గూటం గారు తుది పలుకులతో ఆరంభించగా సోదరులు యన్.జె. మోహన్‌రావ్ గారు అధ్యక్షత వహించి సమర్థ వంతముగా సభను నడిపించిరి. ఉండేశ్వరపురం నుండి వచ్చిన సోదరులు జి.జెకర్యా గారు ప్రార్ధన చేయగా చర్చ ప్రారంభించబడెను. సోదరులు యన్. రవికుమార్ (కందరవిల్లి), యన్.జె. మోహన్‌రావ్ (కొత్తపేట), యన్.మోజెస్ (కరుగోరుమిల్లి), పి.జె.కృపాలిని (పలివెల), సి.హెచ్. వెంకట్రావ్ (తాడిపూడి), బూలయోహాను (పల్లంకుర్రు), యన్. ఏలియా (దేవగుప్తం), జి.జెకర్యా (ఉండేశ్వరపురం), యరియు యన్.రాజారావ్ (యేడిద) గార్లు పై అంశముపై లేఖనములనుండి చక్కటి తలంపులను, సత్యములను వెలుగులోనికి తెచ్చిరి.

బాప్తిస్మము క్రొత్తనిబంధన అంశమైయున్నది. యేసుక్రీస్తుకు ముందుగా వచ్చిన బాప్తిస్మమిచ్చు యోహాను మారుమనస్సు నిమిత్తమైన బాప్తిస్మమును ప్రజలకు యిచ్చుచుండెను. యేసుక్రీస్తు కూడ నీతియావత్తు జరగించు నిమిత్తము యోహానుచే బాప్తిస్మము పొందెను. మారుమనస్సు పొందుటకు ఆయనకు యేమైనా పాపముల ఉన్నవని గాక, దేవుని చిత్తమును పూర్తిగ నెరవేర్చు నిమిత్తము ఆయన బాప్తిస్మము పొందెను.

'బాప్టిజో' అను గ్రీకు పదమునుండి బాప్తిస్మమను మాట ఉద్భవించెను. దానికి నీటిలో ముంచుట, లేక పాతిపెట్టుట యని అర్ధము. అందువలననే 'మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884-63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 18 | జూన్ 1998 | సంచిక 11

## సంపాదకీయం

### బాప్తిస్మము యొక్క ఉద్దేశ్యము

( The Purpoes of Baptisin )

నీవు బాప్తిస్మమును ఎందుకు పొందితివి? అంతరంగిక సమాధానమును బహిరంగముగా ప్రకటించు సూచనగా అది జరిగించబడెనా ? అంటే, నీవు అంతకు ముందే రక్షింపబడితివని చెప్పుటకు అది జరిగించబడెనా ? లేక ఒక సంఘములో చేరుటకు అది జరిగించబడెనా ? లేకపోతే ఎవరినైనా సంతోషపెట్టుటకు నీవు బాప్తిస్మము పొందావేమో ? నీవు పసిబిడ్డగా యున్నప్పుడే బహుశా నీ తలిదండ్రులు నీకు 'బాప్తిస్మము' ఇప్పించారేమో ? అనేక కారణముల కొరకు ప్రజలు బాప్తిస్మము పొందుదురని నీవు గమనించేయుంటావు. అయితే బాప్తిస్మము యొక్క అసలు ప్రయోజనము లేక ఉద్దేశ్యము ఏమిటి ? అది అవుసరమా కాదా? దానిని పొందకుండా యెవడైన రక్షింపబడగలడా ? దానిని పొందకుండ పరలోకమునకు వెళ్లుట సాధ్యమా ?

ప్రభువునకు విధేయలగుట బాప్తిస్మము యొక్క ఉద్దేశ్యము. అయితే

ప్రభువుకు లోబడకుండా యెవడైనా రక్షింపబడగలడా ? క్రీస్తు ఆజ్ఞాపించిన దానిని చేయుటకు నిరాకరించిన వాడెవడైనా పరలోకమునకు వెళ్లుట జరుగునా ?

బాప్తిస్మమును గూర్చి లేఖనములలో యెక్కువ చెప్పబడెను; మన ప్రభువు కూడా దానిని గూర్చి యెక్కువ బోధించెను. అయినను రక్షణతో దానికి సంబంధము లేదనుట వింతగా లేదా ? అది నిజముగా అవుసరము లేని యెడల క్రీస్తు దానిని ఎందుకు ఆజ్ఞాపించును ?

బాప్తిస్మము పొందుటకు క్రీస్తుకూడా ఇష్టపడెను. నీతి యావత్తును నెరవేర్చుటకు ఆయన యోహానుచే బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్లలోనుండి ఒడ్డునకు వచ్చెను అని లేఖనము చెప్పుచున్నది (మత్తయి 3:13-17). ఈ సందర్భములో గమనించదగిన కొన్ని విషయములున్నవి:

1. దేవునికి విధేయత చూపుటకు క్రీస్తు బాప్తిస్మము పొందెను.
2. ఆయన నీటిలో ముంచబడెను; బాప్తిస్మము అనుమాటకు నీటిలో ముంచ బడుట యని అర్థము.
3. అందరికీ ఒక మాదిరిని నెలకొల్పుటకు ఆయన బాప్తిస్మము పొందెను.
4. క్రీస్తు బాప్తిస్మము పొందినందున తండ్రియైన దేవుడు సంతోషించెను.

ఆయనలో పాపమేమియు లేకపోయినను క్రీస్తు బాప్తిస్మము పొందుటకు యిష్టపడిన యెడల, మనము పాపులమై యుండి రక్షణ అవుసరమైన స్థితిలో యుండగా మనము బాప్తిస్మము పొందుటకు ఇంకెంత యిష్టపడవలెను ? బాప్తిస్మము పొందినందున క్రీస్తు తండ్రిని సంతోషపరచిన యెడల, మనము బాప్తిస్మము పొందుటకు నిరాకరించిన యెడల, తండ్రిని సంతోషపెట్టగలమా ?

"నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని క్రీస్తు ఆజ్ఞాపించెను (మార్కు 16:16). దీనిని ఎవరైనా అర్థము చేసికొనగలరా ? దీనిని ఎవరైనా అపార్థము చేసికొనగలరా ? ప్రభువు

చిత్తమును తెలిసికొని దానికి లోబడ గోరువానికి అది అతి విపులముగానే యున్నది. రక్షింపబడ గోరువానికి ప్రభువు చెప్పిన సంగతులు అర్థము చేసికొనుట ఏమంత కష్టముకాదు సరిగదా దేవుని ఆజ్ఞలకు లోబడుట అతనికి సమస్య కానేకాదు.

పెంతెకొస్తు దినమున సువార్తను వినిన ప్రజలు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెననియు అప్పుడు పరిశుద్ధాత్మ అను వరము వారి కనుగ్రహింపబడుననియు పేతురు వారికి చెప్పెను (అపొ.కా. 2:38). ఆనాడు సంతోషముతో వాక్యము నంగీకరించినవారు బాప్తిస్మము పొందిరనియు, వారు సంఘములో చేర్చబడిరనియు లేఖనములలో యున్నది (అపొ.కా. 2:41). తన పాపములు కడిగివేయబడు నిమిత్తము సౌలు లేచి బాప్తిస్మము పొందవలెనని అతనికి చెప్పబడెను (అపొ.కా. 22:16). బాప్తిస్మము పొందుట ద్వారా ఈ ప్రజలు ప్రభువునకు లోబడని యెడల వారి పాపములు క్షమించబడి యుండునా ?

దేవుని రాజ్యములో ప్రవేశించుటకు ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించవలెనని క్రీస్తు చెప్పెను (యోహాను 3:3-5). దేవుని వాక్యము వ్రాయబడులో దేవుని ఆత్మ నడిపించెను. గనుక ఒకడు ఆ హెచ్చరికల ననుసరించునపుడు, ఒకడు నీటిలో ముంచడము పొందినపుడు అనగా బాప్తిస్మము పొందినపుడు అతడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించిన వాడగును. మార్కు 16:16లో క్రీస్తు, అపొ.కా. 2:38లో పేతురు బోధించిన సంగతి యిదే. ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించుటకు నిరాకరించిన యెడల అతడు తిరిగి జన్మించగలడా లేక దేవుని రాజ్యములో ప్రవేశించుటకు నిరీక్షించగలడా ? ఎవడైనను వేరొక రీతిగ జన్మించుటకు అవకాశ మున్నదా ? ఒకడు తిరిగి జన్మించుటకు ఒకటియు, రక్షింపబడుటకు వేరొకటియు చేయునా ? రక్షణలోను, తిరిగి జన్మించుటలోను బాప్తిస్మము యొక్క పాత్ర ఏమియు లేదని అభిప్రాయపడవచ్చునా ?

ఒకడు బాప్తిస్మము ద్వారా ప్రభువునకు లోబడిన యెడల వాడు క్రీస్తులో ప్రవేశించునని పౌలు రోమీయులకు తెలియజేసెను. దేవుని ఈ ఆజ్ఞకు విధేయుడు అగుటలో ఒకడు ప్రభువు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములను చిత్రీకరించునని అతడు తెలియజేసెను. అంటే ఒకడు తన పాపముల విషయమై మృతిజెందును. బాప్తిస్మపు నీటిలో పాటిపెట్టబడును మరియు నూతన జీవితము జీవించుటకు ఆ నీటి సమాధినుండి లేపబడును (రోమా 6:3,4). బాప్తిస్మము పొందకుండా ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించగలడా ? ప్రవేశించలేడు. గనుక దానిలో ప్రాముఖ్యత యున్నది. అది అత్యావసరమై యున్నది. అది జరిగించబడవలెను.

మరల, గలతీ 3:26,27లో మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందితిమనియు, క్రీస్తులో నూతన సృష్టియనియు పౌలు చెప్పెను (2కొరింథీ 5:17). మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందితిమి. అయితే మనము బాప్తిస్మము పొందనియెడల క్రీస్తులో లేము. మనము క్రీస్తులో దేవుని పిల్లలము. అయితే బాప్తిస్మము ద్వారానే మనము క్రీస్తులో ప్రవేశించగలము. ఒకడు బాప్తిస్మము పొందని యెడల అతడు క్రీస్తులో లేడు; అతడు క్రీస్తులో లేనియెడల దేవుని బిడ్డకాడు.

1కొరింథీ 12:13లో మనము క్రీస్తు శరీరములోనికి బాప్తిస్మము పొందితిమని పౌలు చెప్పెను. మరల ఎఫెసీ 1:22, 23లోను, కొలస్స 1:18లోను శరీరము సంఘమనియు లేక సంఘమే శరీరమనియు మనకు చెప్పబడినది. అంటే బాప్తిస్మము ఒకనిని సంఘములో ప్రవేశపెట్టునని దీని యర్థము. అంటే ఒకడు బాప్తిస్మము పొందని యెడల అతడు సంఘములో లేడని కూడ దీని యర్థము. అయితే ఒకడు సంఘములో లేని యెడల అతడు రక్షింపబడలేదు. ఏలయనగా సంఘమయిన శరీరమునకు క్రీస్తే రక్షకుడని పౌలు చెప్పెను (ఎఫెసీ 5:23).

బాప్తిస్మము మనలను రక్షించునని పేతురు ప్రకటించెను (1పేతురు 3:21). అయితే అదెప్పుడు రక్షించును ? లేఖనములను చదువుచుండగా బాప్తిస్మము ఒక్కటి మాత్రమే మనలను రక్షించునని పేతురు చెప్పలేదని మనము గ్రహించగలము. సరిగదా ఒకడు క్షమాపణ పొందుటకున్న ఆయా షరతులకు లోబడి బాప్తిస్మము

పొందిన యెడల బాప్తిస్మము రక్షించునని మనము గ్రహించగలము. సత్యమును వినుట, దేవునియందును క్రీస్తునందును విశ్వాసముంచుట, ఒకని పాపములను గూర్చి మారుమనస్సు పొందుట, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనుట యనునవి వీటిలో యున్నవి (రోమా 10:17; హెబ్రీ 11:6; యోహాను 14:1; లూకా 13:3; మత్తయి 10:32). ఒకడు ఈ యాజ్ఞలకు, బాప్తిస్మము యొక్క ఆజ్ఞకు లోబడినప్పుడు బాప్తిస్మము రక్షించునుగాని అంతకు ముందుకాదు. ఒకడు ముందున్న ఆజ్ఞలన్నిటికి లోబడి బాప్తిస్మము పొందుటకు నిరాకరించిన యెడల అతడు రక్షింపబడ గలడా ? అట్లయితే బాప్తిస్మము మనలను రక్షించుచున్నదని పేతురు యెట్లు చెప్పగలిగెను ? **ఒకడు** ప్రభువు ఆజ్ఞాపించిన దానివి చేయకుండా నిర్మలమైన మనస్సాక్షిని యెట్లు కలిగియుండగలడు ?

ఇక్కడున్న ప్రశ్న యిది: ఒకడు దేవుని ఆజ్ఞ దేనికయినను విధేయత చూపకయుండి రక్షింపబడగలడా ? తప్పక రక్షింపబడలేడు. ఒకడు రక్షింపబడవలెను అంటే యేమి చేయవలెనని ప్రభువు చెప్పెనో దానిని చేయుట ద్వారానే తప్ప మరొక విధముగా యెవడును రక్షింపబడే అవకాశము లేదు. దీనిలో బాప్తిస్మము యిమిడి యున్నది గనుక మిగిలిన వాటితో సహా ఒకడు తప్పక బాప్తిస్మము పొందవలెను. అతడు లోబడిన యెడల రక్షింపబడగలడు. అతడు లోబడుటకు నిరాకరించిన యెడల నశించును. శిక్షననుభవించును. యిది ఈ క్రియను ఆ క్రియను ప్రశ్నించుట కాదు. దానిని ప్రభువు ఎందుకు ఆజ్ఞాపించెనో యను ప్రశ్న కాదు; లక ఒక డజను సంగతులు కాదు. గాని ప్రభువు ఆజ్ఞాపించిన దానిని చేయుటయే దానిలోని ప్రశ్న. అప్పుడు మాత్రమే ఒకడు రక్షింపబడగలడు.

బైబిలు బోధ ప్రకారము నీవు బాప్తిస్మము పొందియుంటివా ? సరియైన కారణము కొరకు నీవు బాప్తిస్మపుటాజ్ఞకు లోబడితివా ? లేనియెడల నీవు ఏమి అనుకొనుచున్నను, ఇతరులు నీకు ఏమి బోధించినను నీవు రక్షింపబడలేదు. ప్రభువు ఆజ్ఞాపించిన రీతిగ నీవు ఈనాడే బాప్తిస్మము పొందవలెనని నిన్ను ప్రోత్సాహించగోరుచున్నాను. నీవట్లు చేసిన యెడల ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చును గా౼ అంతకు ముందుకాదు.

# బాప్తిస్మము పొందుట అవుసరమా ?

## ( Is Baptism Necessary ? )

ఒకడు రక్షణ పొందవలెనంటే బాప్తిస్మము అవుసరమని బైబిలు బోధించుచున్నది. అయితే ఇంకను క్రీస్తునందు విశ్వాసము కలిగియున్న అనేకులు బాప్తిస్మము యొక్క ప్రాముఖ్యతను పూర్తిగ గ్రహించ లేక పోవుచున్నారు. అందువలన రక్షణ పొందవలెనంటే క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట అవుసరమో కాదో ఈ రోజు పరిశీలించుదము.

బాప్తిస్మము ఆజ్ఞయై యున్నది. యేసుక్రీస్తు పునరుత్థానుడై లేచిన తరువాత, తన శిష్యులనిట్లు ఆజ్ఞాపించెను : "పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:19,20). మరల "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును" అని మార్కు 16:16లో యేసు చెప్పెను. ఈ వాక్యములను బట్టి క్రీస్తునందు విశ్వాసియైన వాడు రక్షింపబడుటకు బాప్తిస్మము పొందవలెనని క్రీస్తు ఆజ్ఞాపించినట్లు మనము చూడగలము. అపొ.పేతురు కొర్నేలీ యింటివారికి క్రీస్తును గూర్చిన సువార్తను బోధించి, యేసుక్రీస్తు నామమున వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను అని అపొ.కా. 10:48లో వ్రాయబడి యున్నది. యేసుక్రీస్తు ఆజ్ఞాపించిన బాప్తిస్మమునకు ప్రజలు లోబడవలెనని అపొస్తలులు బోధించిరి. రక్షణ పొందుటకు యేసునందు విశ్వాసముంచుట ఎంత అవుసరమో బాప్తిస్మము పొందుట కూడ అంతే అవుసరము. బాప్తిస్మము అనవుసరము అని నీవనుకొనుచున్న యెడల, క్రీస్తు దానిని ఎందుకు ఆజ్ఞాపించెను? అందుకే "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని యోహాను 14:15లో యేసు చెప్పెను. నీవు క్రీస్తును ప్రేమించుచున్నావా ? అయితే బాప్తిస్మము అను ఆయన ఆజ్ఞకు లోబడుము.

దేవుని రాజ్యములో ప్రవేశించుటకు బాప్తిస్మము అవుసరమని యేసు బోధించెను. యూదుల అధికారియైన నీకొదేమను పరిసయ్యుడొకనితో యేసు ఇట్లనెను : "ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశించలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5). లేఖనములననుసరించి మనము నీటిద్వారా, అనగా బాప్తిస్మముద్వారా జన్మించితేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపలేమని యేసు చెప్పుచున్నాడు.

పాపము నుండి విమోచింపబడుటకు బాప్తిస్మము అవుసరమని అపొ.పౌలు బోధించెను: "మీరు పాపమునకు దాసులై యుండిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి; ఇందుకు దేవునికి స్తోత్రము" అని రోమా 6:17, 18లో బోధించెను. మనము దేనికి హృదయపూర్వముగా లోబడవలెను ? మనము సువార్తకు లోబడవలెనని 2థెస్స 1:8లో అతడు వ్రాసెను. యేసుక్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములను వాస్తవములే సువార్తయైయున్నది (1కొరింథీ 15:3). అయితే క్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములకు మనము ఎట్లు లోబడగలము ? ఇప్పుడు రోమా 6:3-5లను జాగ్రత్తగా పరిశీలించుడి: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగల వారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము". బాప్తిస్మము పొందుటలో, అనగా నీటిలో ముంచబడుటలో క్రీస్తు యేసు యొక్క మరణము, సమాధి, పునరుత్థాన క్రమమునకు మనము లోబడుట జరుగును. అప్పుడే మనము పాపము నుండివిమోచింపబడగలము. అందుకే నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును అని క్రీస్తు చెప్పెను.

బాప్తిస్మము ఇప్పుడు మనలను రక్షించును అని అపొ.పేతురు బోధించెను: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదు గాని యేసుక్రీస్తు పునరుత్థానము మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1పేతురు 3:21). "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" అని అపొ.కా. 22:16 లో వ్రాయబడి యున్నది. ఈ వాక్యములను బట్టి మనము రక్షింపబడుటకు, పాప విమోచన నొందుటకు, పాపములను కడిగివేసికొనుటకు బాప్తిస్మము అవుసరమని మనకు బోధపడుచున్నది. అయితే బాప్తిస్మము ఒక్కటే రక్షించునని దీని యర్థము కాదు. విశ్వాసము ఒక్కటే యెట్లు రక్షించదో అట్లే బాప్తిస్మమొక్కటే రక్షించదు. అందుకే మారుమనస్సు పొందిన విశ్వాసి బాప్తిస్మము పొందవలెనని లేఖనములు బోధించుచున్నవి.

పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట అవుసరమని అపొ.పేతురు పెంతెకొస్తునాడు బోధించెను. అయ్యలారా, రక్షణ పొందుటకు మేమేమి చేయవలెనని ఆనాటి జనసమూహము అపొస్తలుల నడుగగా-"మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని పేతురు వారికి జవాబిచ్చెను (అపొ.కా. 2:38). యేసునందు విశ్వసించిన వీరు ప్రశ్నించగా వారు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని అతడు వారికి చెప్పెను.

క్రీస్తును ధరించుకొను నిమిత్తము బాప్తిస్మము అవుసరము. "క్రీస్తు యేసు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని గలతీ 3:27 చెప్పుచున్నది. క్రీస్తులో యున్నవాడే క్రైస్తవుడు. బాప్తిస్మము పొందుట ద్వారా ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించగలడు. గనుక బాప్తిస్మము పొందినవాడే క్రైస్తవుడు అని మనము గ్రహించగలము.

అంతేకాదు, క్రీస్తు సంఘములో మనము చేరవలెనన్న బాప్తిస్మము పొందుట

అవుసరము. "మన మందరము ఒక్క శరీరములోనికి (అనగా ఒక్క సంఘములోనికి) ఒక ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" యని 1కొరింథీ 12:13లో వ్రాయబడి యున్నది. మనము యేసునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తునందున్న విశ్వాసమును ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన తక్షణమే ప్రభువు మనలను తన సంఘముతో చేర్చుకొనును. నీవు మారుమనస్సు పొందిన విశ్వాసివయిన యెడల బాప్తిస్మము పొందుటకు నీవు జాప్యము ఎందుకు చేయవలెను ? నీకు దగ్గిరగా యున్న క్రీస్తు సంఘమును దర్శించిన యెడల వెంటనే సంతోషముతో నీకు వారు బాప్తిస్మమిచ్చెదరు.

- జాషువా గూటం.

## బాప్తిస్మపు సుకృతము
### ( The Merit of Baptism )

బైబిలు బాప్తిస్మమును బోధించుచున్నది. రక్షింపబడవలెనంటే ఒకడు బాప్తిస్మము (అనగా నీటిలో ముంచడము) పొందవలెనని అది బోధించుచున్నది (మార్కు 16:16). దేవునియందును, క్రీస్తునందును విశ్వాసముంచునట్లు అతడు వాక్యమును వినియున్నాడనియు (రోమా 10:17; హెబ్రీ 11:6), తన పాపములన్నిటి విషయమై మారుమనస్సు పొంది యున్నాడనియు (అపొ.కా. 17:30), క్రీస్తు దేవుని కుమారుడని అతడు మనుష్యుల యెదుట ఒప్పుకొన్నాడనియు అను దానిపై ఆధారపడియున్నది (మత్తయి 10:32). ఇవన్నియు జరిగిన తరువాత ఒకడు బాప్తిస్మము పొందిన యెడల ప్రభువతని రక్షించును, తన సంఘముతో చేర్చును (మార్కు 16:16; అపొ.కా. 2:47).

అయితే నీటిలో ముంచబడియు లేఖనముల ప్రకారము ఎన్నడు బాప్తిస్మము పొందని వారనేకులున్నారు. వారు క్రీస్తునందు విశ్వాసముంచగానే రక్షింపబడిరనియు, తాము రక్షింపబడితిమని చెప్పుటకు గాను వారు బాప్తిస్మము పొందిరనియు వారికి బోధింపబడెను. ఒక డినామినేషనల్ సంఘములో చేరుటకు వారు బాప్తిస్మము

పొందిరని వారికి చెప్పబడెను. ఇది వింతగా కనబడుచున్నను, దీని విషయమై ఇట్టి వారికి సత్యము బోధింపబడినను వీరిలో అనేకులు మరల ముంచడము బొందుటకు నిరాకరింతురు. ఒకేఒక్క బాప్తిస్మము ఉన్నదిగదా యని వారు వాదింతురు. ఒకే ఒక్క బాప్తిస్మమున్నదని బైబిలు బోధించుచుండుట సత్యమే (ఎఫెసీ 4:5). అయితే ముంచడములన్నియు బాప్తిస్మము కాదు. లేఖనములు ప్రకారము బాప్తిస్మము పొందవలెనంటే ఒకడు నీటిలో ముంచబడుట మాత్రమే కాదు గాని అతడు సరియైన ప్రయోజనము కొరకు, పాపక్షమాపణ కొరకు, ప్రభువు సంఘములో ప్రవేశించుట కొరకు బాప్తిస్మము పొందవలెను (అపొ.కా. 8:36,39; 2:38; 2:47).

యోహాను బాప్తిస్మమును బట్టి బాప్తిస్మము పొందిన కొందరితో అపొ.పౌలు సంప్రదించుటను అపొ.కా. 19వ అద్యాయములో మనము చూడగలము. యోహాను శిష్యులు చేసిన బోధను వారంగీకరించిరి. అయితే క్రీస్తు ఆజ్ఞాపించిన దానిని బట్టి యోహాను బాప్తిస్మము ఇంక అమలులో లేదని వారెరుగరైరి. ఈ యంశమును గూర్చిన సత్యమును పౌలు వారికి బోధించెను. "వారు ఆ మాటలు విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి" యని బైబిలులో రికార్డు చేయబడి యున్నది (అపొ.కా. 19:5).

నేనెప్పుడు రక్షింపబడితిని ? అని నిన్ను నీవే ప్రశ్నించుకో, రక్షింపబడిన ఎంతకాలానికి నేను బాప్తిస్మము పొందితిని ? యని మరల ప్రశ్నించుకో. నీవు మొహమాట పడనవసరములేదు. ఈ ప్రశ్నలకున్న యధార్థ జవాబులను నీవెరుగుదువు. నీవొకప్పుడు రక్షింపబడి ఆ తరువాత ఎప్పుడో బాప్తిస్మము పొందిన యెడల నీవు లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందలేదని దీని యర్థము. లేదా నీవొక డినామినేషనల్ సంఘ సభ్యుడవయిన యెడల నీవు లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందలేదని యర్థము. క్రీస్తు మాటలను బైబిలు యిట్లు చెప్పుచున్నది: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింప బడును" (మార్కు 16:16). మరల, "రక్షింపబడిన ప్రతి వానిని ప్రభువు తన సంఘముతో చేర్చు చుండెను" అని అపొ.కా. 2:47లో మనము చదువగలము.

గనుక బైబిలు క్రమము యిట్లున్నది : ఒకడు విశ్వసించును, బాప్తిస్మము పొందును, రక్షింపబడును, సంఘములో చేర్చబడును. దీనిని ఇంకా వివరించాలంటే-ఒకడు దేవుని వాక్యమును వినినప్పుడు దేవునియందును క్రీస్తునందును విశ్వసించును, తన పాపముల విషయమై మారుమనస్సు పొందును, క్రీస్తును ఒప్పుకొనును, బాప్తిస్మము పొందును. అతడు రక్షింపబడును. అట్లు రక్షింపబడిన వారినందరిని ప్రభువు తన సంఘముతో చేర్చును. అంటే, ఒకడు నిజముగా క్రీస్తునందు విశ్వసించిన యెడల, ప్రభువతని నేమి చేయవలెనని కోరునో వాటిని తప్పక చేయును. వాటిలో ఖచ్చితముగా మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మములు ఇమిడి యున్నవి.

నీవు లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందని యెడల నీవు మరల ఈసారి సరియైన కారణము కొరకు ముంచడము పొందుట తెలివైన పనియగును. అప్పుడది బైబిలు బోధించుచున్న ఒకే ఒక్క బాప్తిస్మమగును. రక్షణను గూర్చిన సందర్భములో క్షేమకరమైన మార్గము ననుసరించుట ఉత్తమము. నీవు మొదట ఒకసారి ముంచబడినను అది లేఖనముల ప్రకారము లేనియెడల నీవు రెండవసారి ముంచబడినప్పటిదే బైబిలు బోధించు ఒకే ఒక్క బాప్తిస్మమగును. లేఖనములు ప్రకారము రెండుసార్లు బాప్తిస్మము పొందుట సాధ్యము కాదు. నీవు పొందిన మొదటి బాప్తిస్మము వాక్య ప్రకారము లేనియెడల అది బాప్తిస్మము కానేకాదు. అట్లే నీవు రెండవసారి పొందిన బాప్తిస్మము కూడ వాక్యప్రకారము లేనియెడల అది బాప్తిస్మము కానేరదు. కొందరు అనేకసార్లు ముంచబడుదురు గాని వారు పొందేది బాప్తిస్మము కాదు. వాక్యప్రకారము ఒకే ఒక్క బాప్తిస్మమున్నది; ప్రభువు బోధననుసరించి ముంచబడినప్పుడే అది బాప్తిస్మమగును.

ముంచడము పొందినంత మాత్రముననే కలిగే సుకృతమేమియు లేదు. కొంతమంది బోధకులు అనేకమంది ప్రజలతో మెలుగుచుందురు. వారందరికి సరిగా బోధించలేమనియు మరియు క్రొత్తగా మార్పుజెందిన వారికి బోధించవలసినది అంతా బోధించలేమనియు వారెరుగుదురు. అట్టివారు ఒకడు సంపూర్తిగా

గ్రహించుకొన లేకపోయినను, లేక ఒకడు నమ్మకమైన క్రైస్తవునిగా యుండునట్లు సరిగ బోధింపబడక పోయినను అట్టివానికి బాప్తిస్మమియ్యక పోవుటకంటే బాప్తిస్మమిస్తేనే మంచిది యని ఆలోచింతురు. ఒకడు ఒకేసారి గాని లేక ఒక డజనుసార్లుగాని ముంచడము పొందినను బాప్తిస్మము సరిగ వాక్యప్రకారము ప్రయోజనకారిగా అంటే అతని రక్షించేదిలా ఎప్పుడు ఉండునంటే బాప్తిస్మము పొందువాడు దేవుని చిత్తమును సరిగ గ్రహించుకొనినప్పుడు మాత్రమే. అతడతని విశ్వాసముపై ఆధారపడి మిగిలిన ఆజ్ఞలకు లోబడుచు బాప్తిస్మము పొందినప్పుడు మాత్రమే అతడు పొందిన యెడల బాప్తిస్మము ప్రయోజనకారియగును. సరియైన జ్ఞానము లేకుండా పొందే బాప్తిస్మములో విలువ ఏమియు లేదు. ముంచడము ఒక్క దానిలో ఎవ్విధమైన విలువగాని, సుకృతముగాని లేక రక్షించే శక్తిగాని లేదు.

నీవెట్లు బాప్తిస్మము పొందితివి ? నీవెందు నిమిత్తము బాప్తిస్మము పొంది తివి ? నీ బాప్తిస్మపు ఫలితమేమి ? నీవు వాక్య ప్రకారము బాప్తిస్మము పొంది తివా ? నీవు వాక్య ప్రకారము బాప్తిస్మము పొంది దేవునికి లోబడని యెడల నీవు రక్షింపబడి క్రీస్తు సంఘములో చేర్చబడు నిమిత్తము ఆయనకు లోబడవలెనని నిన్ను హెచ్చరించ గోరుచున్నాను. ఇది తప్ప వేరే మార్గము లేదు.

## బాప్తిస్మమెవరికి అవుసరము?

### ( Who needs Baptism? )

క్రైస్తవలోకములో బాప్తిస్మము అతి వాగ్వివాదాంశమైయున్నది. అయితే అన్ని వివాదములను బైబిలు ఒక్కటి మాత్రమే పరిష్కరించగలదు. ఏలయనగా అది మానవులకు బయలుపరచబడిన దేవుని జ్ఞానము. మానవులకు బాప్తిస్మపు అవసరతను దాని ప్రాముఖ్యతను ఇప్పుడు బైబిలునుండి తెలిసికొందము.

**1)** బాప్తిస్మము మానవ కల్పితమా లేక దైవ సంకల్పమా ? కొందరు బోధించే విధానమును బట్టి చూస్తే దీనిని గూర్చి మనమసలు పట్టించుకోనవసరము లేదు. అయితే బాప్తిస్మము ఎక్కడ ప్రారంభమైనది ? దానినెవరు ఆజ్ఞాపించిరి ?

A) బాప్తిస్మమిచ్చు యోహాను మారుమనస్సు నిమిత్తమై బాప్తిస్మమును ఆజ్ఞాపించెనని మన మెరుగుదుము. మన ప్రభువుకూడ ఈ క్రియకు లోబడెను. ఆయనకేమైనా పాపమున్నదని కాదు గాని నీతియావత్తును జరిగించుటకు ఆయన బాప్తిస్మము పొందెను (మత్తయి 3:15).

B) యేసు పరలోకమునకెక్కి పోవకముందు తన శిష్యులకు ఒక గొప్ప ఆజ్ఞను ఇచ్చెను : "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15,16). ఇదే ఆజ్ఞను గూర్చి మత్తయి 28:18-20లో మనము చదువగలము. గనుక దీనిని యేసే గాని యేమానవుడును ఆజ్ఞాపించలేదని గ్రహించగలము.

2) బాప్తిస్మములో ఏ పదార్థము వినియోగించబడును ? మన జవాబుకొరకు బైబిలునొద్దకే వెళ్లుదము.

A) మార్కు 1:9-11లో యేసు యోర్దాను నదిలో బాప్తిస్మము పొందుట చూడగలము. ఆయన నీటిలోనికి వెళ్లి మరల నీటిలో నుండి వెడలి వచ్చినట్లు మనము చదువగలము.

B) అపొ.కా. 8:36లో ఐతియోపీయ నపుంసకుడు, "ఇదిగో నీళ్ళు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమి?"యని అడిగెను. గనుక బైబిలు బాప్తిస్మము నీటిలో అనగా విస్తారమైన నీటిలో జరుగునని మనము గ్రహించగలము (యోహాను 3:23).

3) బాప్తిస్మమును ఎవరు పొందవలెను ? పసిబిడ్డలుగా యున్నపుడే అనేకులు ప్రతిష్ట చేయబడతారు. దానిని వారు బాప్తిస్మమని చెప్పుచూ యుంటారు. అయితే ఇది సాధ్యమా ? ఒక పసిబిడ్డ క్రీస్తు సువార్తను విని గ్రహించుకొనగలడా ? పసిబిడ్డ పాపియా ? అవునని కొందరు మనకు తెలియజెప్ప ప్రయత్నింతురు

గాని అది సత్యముకాదు. మన పాపములకు మనము బాధ్యులము; వాటినుండి మనము కడుగబడవలెను. పసిబిడ్డలు పవిత్రులు, నిర్దోషులు. వారికి రక్షణ అవుసరము లేదు. వారు సురక్షితులే. దేవుని గ్రంథమంతటిలోను పసిబిడ్డల రక్షణను గూర్చిన సంకల్పము ఎక్కడను లేదు. అట్లయితే బాప్తిస్మమెవరు పొంద వలెను ?

బైబిలు ప్రకారము ఈ దిగువ నుదహరించినవారు బాప్తిస్మము పొంద వచ్చును : a) వాక్యము బోధింప బడినవారు b) దానిని గ్రహించుకొనినవారు c) ప్రభువు నందు విశ్వసించినవారు d) తమ పాపముల విషయమై విషయమై మారు మనస్సు పొందినవారు e) క్రీస్తును ఒప్పుకొనినవారు. గనుక పసిబిడ్డలకు గాని, అజ్ఞానులకుగాని ఈ ఆజ్ఞ వర్తించదని మనము గ్రహించవలెను.

4) సరిగ బాప్తిస్మమిచ్చు విధానమేది ?

A) బాప్తిస్మము అను పదము 'బాప్టిజో' అను గ్రీకు పదమునుండి ఉద్భవించినది. క్రొత్తనిబంధనలో దీనికి నీటిలో ముంచుట యని అర్థము. ఈ భావము తప్ప వేరొకటి సరియైనది కాదు.

B) చిలకరించుట, కుమ్మరించుట యనునవి బైబిలులో బాప్తిస్మముగా వర్ణించబడలేదు.

C) యేసు నీళ్ళలోనికి వెళ్లినట్లున్నది. చిలకరింపే సరియైనదయితే నీళ్ళలోనికి వెళ్ళుట ఎందుకు ? రోమా 6:3,4లో బాప్తిస్మమనగా పాతిపెట్టుటయని పౌలు చెప్పుచున్నాడు. నీవు దేనినయినా పాతిపెట్టునప్పుడు దానిపై కొంచెము యిసుక మాత్రమే జల్లుదువా ? లేక కొంత యిసుకను కుమ్మరింతువా ? కానేకాదు. నీవొక గోతిని చేసి దానినందులో పాతిపెట్టుదువు. బైబిలు బాప్తిస్మముకూడ అంతే; అది నీటి సమాధి.

D) రక్షింపబడుటకు బాప్తిస్మము అవుసరమా ? అవుసరముకాదని చాలమంది చాటుచూ యుంటారు.; అనేక వ్యాసములు, గ్రంధాలు వ్రాస్తు యుంటారు.అయితే మనలను పాపమునుండి రక్షించునదేమిటి ?

E) మత్తయి 26:8:-"ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని యేసుక్రీస్తు చెప్పెను. యేసు రక్తము మన పాపములను కడిగివేయును.

F) ప్రకటన 1:6:- "మనలను ప్రేమించుచు తన రక్తము వలన మనలను కడిగినవానికి" అని వ్రాయబడియున్నది. మనలను రక్షించునదేమిటో ఈ రెండు లేఖనములు తెలియజేయుచున్నవి.

G) "మీరు  మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని అపొ.కా. 2:38 చెప్పుచున్నది.

"గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమున బట్టి ప్రార్ధన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" అని అపొ.కా. 22:16లో వ్రాయబడియున్నది. ఈ రెండు సందర్భములలోను వారు బాప్తిస్మము పొందినప్పుడు వారి పాపములు క్షమించబడెనని మనము చదువగలము.

బాప్తిస్మము మనలను రక్షించునని విపులముగా బైబిలులో ఎక్కడయినా వ్రాయబడియున్నదా ? అవును!! గలతీ 3:27లో పౌలు, "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని చెప్పెను. పేతురు ఇట్లనుచున్నాడు : "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది; అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుట కాదు గాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" (1పేతురు 3:21). బాప్తిస్మము మనలను రక్షించునని

పేతురనుచున్నాడు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందకుండా నిర్మలమైన మనస్సాక్షి కలిగియుండుట అసాధ్యము.

నీ సంగతి యేమిటి ? అది నీకవుసరమా ? అట్లయితే నీవెక్కడున్నను సరే ముందుకు వచ్చి దేవుని సత్యమునకు లోబడుము. నీవు క్రైస్తవుడవు మాత్రము కమ్ము. క్రీస్తు స్థాపించిన సంఘములో చేర్చబడుము.

- బాబ్ హార్డ్.

## ఐతియోపీయుడు మార్పుజెందుట

### ( Conversion of the Ethiopian )

అపొస్తలు కాలములో పరిశుద్ధాత్మ వలన నడిపింపబడిన వారు వాక్యమును బోధించిరి. వారు అన్నిచోట్ల ప్రకటించిన సువార్త అంతయు యేసుప్రభువు వారికిచ్చిన గొప్ప ఆజ్ఞను బట్టి యుండెను.

సౌలు అనునతడు క్రైస్తవులను హింసించు సమయమందు అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయములోని సంఘటనలు జరిగెను. యెరూషలేములో గొప్ప హింస రాగా క్రీస్తు శిష్యులు లోకమందంతటా చెదిరిపోయి సువార్తను ప్రకటింప నారంభించిరి. ఫిలిప్పు అనునతడు యెరూషలేము సంఘములో పరిచారకుడుగా యుండెను. అతడు సమరయ పట్టణము వరకును వెళ్ళి క్రీస్తును వారికి ప్రకటించు చుండెను. జనసమూహములు విని ఫిలిప్పు చేసిన సూచక క్రియలను చూచినందున అతడు చెప్పిన మాటలయందు విశ్వసించిరి. అంతేకాదు సువార్తను నమ్మిన పురుషులును, స్త్రీలును ఆ పట్టణమందు బాప్తిస్మము పొందిరి.

సమరయవారు దేవుని వాక్యము అంగీకరించిరని యెరూషలేములోని అపొస్తలులు విని పేతురును, యోహానును వారి యొద్దకు పంపిరి. ఆ ఇద్దరు అపొస్తలులు సమరయకు వచ్చి వారు పరిశుద్ధాత్మను పొం[illegible]నని వారికొరకు ప్రార్థన చేసిరి.

ప్రభువు దూత ఫిలిప్పునకగుపడి, నీవు లేచి దక్షిణముగా వెళ్ళి యెరూషలేము నుండి గాజాకు పోవు అరణ్యమార్గమును కలసికొమ్మని చెప్పగా అతడు లేచివెళ్ళెను. అప్పుడు ఐతియోపీయుల రాణియైన కందాకే క్రింద మంత్రియై ఆమెయొక్క ధనాగారమంతటి మీదనున్న ఐతియోపీయుడైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చియుండెను. అతడు తిరిగి వెళ్లుచు తన రథము మీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండెను. అప్పుడు ఆత్మ ఫిలిప్పుతో, నీవు ఆ రథము దగ్గరకు పోయి దానిని కలసికొనుమని చెప్పెను.

యెరూషలేమునుండి తిరిగి వెళ్ళుచున్న ఆ నపుంసకునికి క్రీస్తును గూర్చియు, రక్షణ గూర్చియు, పరిశుద్ధాత్ముడు అద్భుత రీతిగ బోధింపగలడు గాని క్రీస్తు యిచ్చిన ఆజ్ఞలో ఆ పని మానవులకు అప్పగింపబడెను. మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడియను ఆజ్ఞను క్రీస్తు తన అపొస్తలుల కిచ్చెను. వారానాడు బోధించిన వాక్యము ద్వారా పరిశుద్ధాత్ముడు పని చేసెను. ఈనాడు కూడ బోధకుడు బోధించుచున్న లేఖనములద్వారా దేవుని ఆత్మ పనిచేయును. ప్రకటింప బడుచున్న సువార్త నమ్ము ప్రతివానిని రక్షించుటకు దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). దేవుని దూత ఐతియోపీయుని కగుపడలేదు గాని అతడు బోధకుడైన ఫిలిప్పును చూచెను. దూత ఐతియోపీయుని కగుపడి హెచ్చరిక లిచ్చెను. సువార్త వినువానిని బోధకునితో దేవుని ఆత్మ ఈ సందర్భములో కలిపెను.

యెరూషలేములో ఆరాధించి తిరిగి ఐతియోపీయకు వెళ్ళిపోవుచున్న యతడు గొప్ప అధికారము గలవాడు. అతడు ఐతియోపీయుల రాణియైన కందాకే యొక్క ఆర్థికమంత్రి. అతడు యూదుడు లేక యూదా మత ప్రవిష్టుడై యుండవచ్చును. అతడు ప్రయాణము చేయుచు యెషయా వ్రాసిన గ్రంథమును చదువుచుండెను గాని అతనికి క్రీస్తుని గూర్చి గాని క్రైస్తవ్యమును గూర్చి గాని ఏమియును తెలియదు. అయితే అతడు లేఖనమునందు చదువుచున్న భాగమేదనగా "ఆయన గొఱ్ఱెవలె వధకు తేబడెను. బొచ్చు కత్తిరించు వానియెదుట గొఱ్ఱెపిల్ల ఏలాగు మౌనముగా ఉండునో ఆలాగే ఆయన నోరు తెరువకుండెను. ఆయన దీనత్వమును బట్టి

ఆయనకు న్యాయవిమర్శ దొరుకకపోయెను. ఆయన సంతానము ఎవరు వివరింతురు ? ఆయన జీవము భూమిమీద నుండి తీసివేయబడినది.''(అపో.కా. 8:32-33).

సువార్తికుడైన ఫిలిప్పు ఈ నపుంసకుని రథము దగ్గరకు పరుగెత్తు కొనిపోయి అతడు ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండగా విని, నీవు చదువునది గ్రహించుచున్నావా ? అని అడిగెను. అందుకా నపుంసకుడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి, రథమెక్కి తనతో కూర్చుండుమని ఫిలిప్పును వేడుకొనెను. అప్పుడు నపుంసకుడు-ప్రవక్త యెవనిని గూర్చి యీలాగు చెప్పుచున్నాడు ? తన్ను గూర్చియా, వేరొకని గూర్చియా? దయచేసి నాకు తెలుపుమని ఫిలిప్పు నడిగెను.

"అందుకు ఫిలిప్పు నోరు తెరచి, ఆ లేఖనములను అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను''. యేసు జీవితములోని ప్రతి ఘట్టమును ప్రవక్తలచే ముందుగనే చెప్పబడెను. ఈ ఐతియోపీయ మనుష్యుడు సత్యారాధికుడు గనుక పాత నిబంధన ప్రవచనములను బాగుగా యెరిగి యుండెను; ఫిలిప్పు యేసు యొక్క జననమునుండి ఆయన మరణము, పునరుత్థానము, ఆరోహణము వరకు గల కథను అతనికి బోధించెను. అతడు ఎదురు చూచుచున్న రక్షకుడు యేసే అని అతడు గ్రహించెను. యేసు పాత నిబంధన ప్రవచనముల నెరవేర్పని నపుంసకుడు గ్రహించెను. యేసుయొక్క జనన మరణములను గూర్చి అతడు చదువుచున్న లేఖనముపై ఆధారపడి ఫిలిప్పు అతనికి సువార్త బోధించెను. యేసే నిజమైన రక్షకుడని అతడు గ్రహించగానే ఆయనను సేవింపవలెనని అతడు ఆశించెను.

యేసు చనిపోయి తిరిగి లేచిన తరువాత తన శిష్యుల కిచ్చిన గొప్ప ఆజ్ఞను గూర్చి ఫిలిప్పు ఈ ఐతియోపీయునికి బోధించెను. యేసు ఇట్లు చెప్పెను : "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును'' (మార్కు. 16:15,16).

మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:19,20). ఫిలిప్పు అతనికి క్రీస్తు సువార్తను బోధించుచు వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు- ఇదిగో నీళ్ళు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను.

ఫిలిప్పు అతనికి క్రీస్తు సువార్తను ప్రకటించినప్పుడు బాప్తిస్మము యొక్క అవుసరతను గూర్చి బోధించెను. మీరు మారుమనస్సు బొంది పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి యను పరిశుద్ధాత్ముని ఆజ్ఞను గూర్చి అతనికి తెలియజేసెను. ఫిలిప్పు లేఖనముపై ఆధారపడి ఈ నపుంసకునికి క్రీస్తును గూర్చి బోధించగా అతడు విశ్వసించెను, మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుటకు తక్షణమే అంగీకరించెను. అయితే అతడు బాప్తిస్మము పొందుటకు ముందు ఇంకొక సంగతిని చేయవలసి యుండెను. క్రీస్తునందున్న అతని విశ్వాసమును నోటితో ఒప్పుకొనవలెను. ఏలయనగా "మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఒప్పుకొనునో నేనును వానిని ఒప్పు కొందును. మనుష్యుల యెదుటఎవడు నన్ను ఎరుగననునో నేనును ఎరుగనందును" అని యేసు చెప్పెను (మత్తయి 10:32,33). [illegible]చువలన బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని నపుంసకుడు ఫిలిప్పు నడుగగా, [illegible] నీవు పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొంద వచ్చునని చెప్పెను. [illegible]డు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను.

అప్పుడు ఫిలిప్పు, నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అ[illegible]కి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలో నుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను.

[illegible]ఖనములు ప్రకారము బాప్తిస్మమనగా నీళ్ళలో ముంచబడుటయని అర్ధము.

విశ్వసించినవారు, తమ పాపముల విషయమై మారుమనస్సు పొందినవారు తమ పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున ముంచడము పొందవలెను. ఇక్కడ ఫిలిప్పు నపుంసకునికి నీళ్ళలో ముంచడము యిచ్చుటను గూర్చి మనము గ్రహించి యుంటిమి. బాప్తిస్మము పొందిన తరువాత నపుంసకుడు పాప విముక్తుడై, రక్షించబడిన వాడై సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను. అతడిప్పుడు క్రైస్తవుడయ్యెను. క్రీస్తు రాజ్యములోను, ఆయన సంఘములోను సభ్యుడయ్యెను. అందువలన సంతోషముతో తన ప్రయాణములో ముందుకు సాగెను.

మిత్రుడా! నీ విషయమేమిటి ? సంతోషముతో నీ జీవితయాత్రను గడుప వలెనంటే క్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు బొందుము, క్రీస్తును ఒప్పుకొని బాప్తిస్మము పొంది రక్షించబడుము. ఇదిగో ఈరోజే అనుకూల సమయము, ఇదియే రక్షణ దినము !!

- జాషువా గూటం.

## చిలకరింపు, కుమ్మరింపు, ముంచడము ఇందులో ఏది ?

( Sprinkling, Pouring or Immersion - which ? )

నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును; నమ్మనివానికి శిక్ష విధించ బడును" (మార్కు 16:16).

I. నీటి బాప్తిస్మము ఆజ్ఞాపించబడెను :

A) మత్తయి 28:19. "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి'

B) అపొ.కా. 2:38 "పేతురు-మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ

నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు"?

C) అపొ.కా. 10:48. "యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని అతడు ఆజ్ఞాపించెను".

D) అపొ.కా. 18:8. "మరియు కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి".

E) అపొ.కా. 22:16. "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసికొనుము".

F) రోమా 6:3. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ?".

G) రక్షణ పొందవలెనన్న, క్రీస్తుతో చేర్చబడవలెనన్న క్రీస్తును, ఆయన అపొస్తలులును బాప్తిస్మమును ఆజ్ఞాపించినట్లు ఇక్కడ మనము చూడ గలుగుచున్నాము.

**II.** బాప్తిస్మము పొందగల అభ్యర్థులెవరు ?

A) బోధింపబడగలవారు (మత్తయి 28:18-20).

B) విశ్వసింపగలవారు (మార్కు 16:15,16).

C) మారుమనస్సు పొందినవారు (అపొ.కా. 2:38).

D) ఒప్పుకొనినవారు (అపొ.కా. 8:37).

"ఫిలిప్పు, నీవు పూర్ణహృదయముతో విశ్వసించిన యెడల బాప్తిస్మము పొందవచ్చునని చెప్పెను. అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించు చున్నానని యుత్తర మిచ్చెను. అని కొన్ని ప్రాచీన ప్రతులలో వ్రాయబడి యున్నది." మత్తయి 10:32; రోమా 10:9-10ల నుండి క్రీస్తు దేవుని

కుమారుడని ఒప్పుకొనవలసిన ప్రాముఖ్యతను గమనించుము.

E) పసిబిడ్డలు బాప్తిస్మము పొందగల అభ్యర్థులు కారు.

1. వారు నశించిన స్థితిలో లేరు; నశించనివారు రక్షింపబడవలసిన పనిలేదు. పసిబిడ్డలకు పాపమేమియు లేదు వారు సురక్షితులే.

2. పసిబిడ్డలు విశ్వసించలేరు, మారుమనస్సు పొందలేరు, ఒప్పుకొనలేరు (అపో.కా. 8:37).

## III. క్రొత్తనిబంధనలో కొందరు మరల బాప్తిస్మము పొందిరి :

A) క్రీస్తు చట్టము అమలులోనికి వచ్చిన తరువాత యోహాను బాప్తిస్మము పొందిన 12 మందిని పౌలు కనుగొనెను (అపో.కా. 19:3).

B) పౌలు చేసిన ఉపదేశమును బట్టి వారు యేసుప్రభువు నామమున అనగా ఆయన అధికారము చొప్పున ఆయన నియమించిన ప్రయోజనముకొరకు బాప్తిస్మము పొందవలెనని వారు గ్రహించుకొనిరి.

C) ఈ రోజుకూడ అనేకులు కాని విధముగను, కాని కారణముల కొరకును బాప్తిస్మము పొందినవారున్నారు. అట్టివారు పాప క్షమాపణ కొరకు బాప్తిస్మము పొందవలెను (అపో.కా. 2:38; రోమా 6:1-11).

## IV. చిలకరింపు, కుమ్మరింపు, ముంచడము-ఇందులో యేది :

A) బాప్తిస్మము ఒక సమాధి. "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతి పెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" (కొలస్స 2:12).

B) బాప్తిస్మముకు ఈ దిగువ సంగతులు అవుసరము :

1. విస్తారమైన నీళ్ల (యోహాను 3:23).

2. నీటియొద్దకు వెళ్లుట (అపో.కా. 8:36).

3. నీటిలోనికి దిగుట (అపో.కా. 8:38).

4. నీటిలోనుండి వెడలి వచ్చుట (మత్తయి 3:16). యేసు యోహానుచే బాప్తిస్మము పొందెను. పాపక్షమాపణ నిమిత్తము కాదుగాని నీతి యావత్తును నెరవేర్చుటకు ఆయన బాప్తిస్మము పొందెను. ఆయనలో పాప మేమియు లేదు.

C) దేవుని వాక్యములో 'బాప్తిస్మము' :

1. బాప్తిస్మమను పదము గ్రీకులో బాప్టిజో, దీనికి ముంచుట, నీటిలో మునగ బెట్టుట, పాతిపెట్టుట యని అర్థము.

2. చిలకరించుట అను పదము గ్రీకులో రేంటిజో; కుమ్మరించుటకు కీయో.

3. బాప్తిస్మమును గూర్చి చెప్పబడినప్పుడు గ్రీకు క్రొత్త నిబంధన లో యెల్లప్పుడు బాప్టిజో అను పదము వాడబడెను.

V. చిలకరింపు, కుమ్మరింపుల చరిత్ర :

A) నోవెషన్ అనునతడు జబ్బుపడి మంచము పట్టి యుండగా మొట్టమొదటిగా క్రీ॥శ॥ 251లో చిలకరించబడెను.

B) మొదట వికలాంగులకు మాత్రమే చిలకరింపు, కుమ్మరింపు ఇయ్యబడేది.

C) క్రీ॥శ॥ 1311లో రావెన్నలో జరిగినసభ రోమన్ కేథలిక్కు సంఘములో చిలకరింపును చట్టబద్ధము చేసెను.

D) చిలకరింపు, కుమ్మరింపులు మానవ కల్పితములు గనుక దేవుని రక్షణ సంకల్పమును అవి జరిగించలేవు.

VI. క్రొత్త నిబంధన బాప్తిస్మపు ప్రయోజనములు :

A) అది యిప్పుడు మనలను రక్షించుచున్నది (1పేతురు 3:20,21).

B) దాని ఫలితము, పాపక్షమాపణ (అపో.కా. 2:33).

C) అది పాపములను కడిగివేయును (అపో.కా. 22:16).

D) అది మనలను క్రీస్తులో ఉంచును (గలతీ 3:26,27).

E) మనము క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందియుంటిమి (రోమా 6:3,4). క్రీస్తు తన మరణములో రక్తమును చిందించెను (యోహాను 19:32-37). మనమాయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమి. మన పాపములను కడిగి వేయు రక్తము దరికి బాప్తిస్మములోనే మనము చేరుకొనగలము.

నీ గ్రామములో యున్న క్రీస్తు సంఘారాధనలకు హాజరుకమ్ము, సువార్తకు ఇప్పుడే లోబడుము !!

- బిల్ ప్రెయిట్. Sr.

ముఖ్య గమనిక : మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడు మాకు వెంటనే తెలియజేయండి. సత్యవాక్కు పత్రికపై యున్న మీ అడ్రసుపై ఉన్న నంబరును తప్పక వ్రాయండి. ఆ నంబరు లేనిదే మీ అడ్రసును మార్చుటకు వీలుపడదు. ఇప్పుడు సత్యవాక్కు మాసపత్రిక ప్రతినెలా పది వేల గృహాలను దర్శించుచున్నది.

మీ బంధువులు, మిత్రులు బేసిక్ బైబిలు కోర్సు లో చేరేటట్లు చేయండి. వారి అడ్రసులను మాకు పంపితే వారికి పోస్టు ద్వారా బైబిలు పాఠములను ఉచితముగా పంపించెదము. బేసిక్ బైబిలు కోర్సు పూర్తిచేసిన వారికి యోగ్యతా పత్రముతో పాటు ఒక బైబిలు ఇప్పుడు బహుమతిగా ఇయ్యబడుచున్నది.

Edited & Published by Joshua Gootam & Printed at Satya Vani, Kakinada - 533 004.

లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" యని పౌలు చెప్పెను (కొలస్స 2:12).

సువార్తను "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధించబడునని" యేసు చెప్పెను (మార్కు 16:16). నిజానికి అది "నమ్మి ముంచ బడిన వాడు రక్షింపబడునని" తర్జుమా చేయబడవలసియుండెను. మారుమనస్సు పొందిన విశ్వాసి యేసే దేవుని కుమారుడని ఒప్పుకొనిన యెడల బాప్తిస్మము పొంద వచ్చును. గనుక పసిపిల్లలు విశ్వసించలేరు, మారుమనస్సు పొందుటకు వారు పాపులుకారు, క్రీస్తునందలి విశ్వాసాన్ని ఒప్పుకొనలేరు. గనుక అట్టివారికి బాప్తిస్మమిచ్చుట నిష్ప్రయోజనమే. లేఖనానుసారమైన బాప్తిస్మము రక్షించబడుటకు, పాపక్షమాపణ కొరకు, క్రీస్తు సంఘములో చేర్చబడుటకు నిర్దేశించబడినది. ఒకడు విశ్వసించి, మారు మనస్సు పొంది, క్రీస్తును ఒప్పుకొని బాప్తిస్మము పొందితేనే రక్షించబడునుగాని అంతకుముందుకాదు. బాప్తిస్మము పొందక ముందు రక్షింపబడిన వారి సందర్భములు ఏమీ క్రొత్త నిబంధనలో లేవు.

సిలువపైనున్న దొంగ విషయములోనైతే అప్పటికి యేసుప్రభువు ఇంకను సజీవునిగా భూమిపైయుండెను. మరియు భూమిపై పాపములు క్షమించు అధికారము ఆయన కలిగియుండెను. క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన ఆజ్ఞాపించిన బాప్తిస్మమొక్కటే ఇప్పుడు అమలులో యున్నది. అది దేవుని ఆజ్ఞ. దానికి అందరూ లోబడాలి. పరిశుద్ధాత్మ బాప్తిస్మమైతే అదొక వాగ్దానము. దానిని దేవుడు మొదటి శతాబ్దములోనే నెరవేర్చెసాడు. అది ఇప్పుడు అమలులో లేదు.

లేఖనానుసారమైన బాప్తిస్మము తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి ఇయ్యవలెను. రక్షణ పొందువాడు యేసు నామములో రక్షణ పొందును గాని బాప్తిస్మమిచ్చువాడు తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములో ఇయ్యవలెను(మత్తయి 28:18-20). పాపులను రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను (1తిమో 1:15).

నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని ఆయన చెప్పెను. గనుక రక్షింపబడుటకు బాప్తిస్మము అవుసరము.

"నీవు చదువునది గ్రహించుచున్నావా ?" యని సువార్తికుడైన ఫిలిప్పు యెషయా గ్రంథమును చదువుచున్న ఐతియోపీయ ఆర్థిక మంత్రి నడిగెను (అపో.కా. 8). అతడు చదువుచున్న లేఖన భాగమునకు గురించి ఫిలిప్పు యేసును గూర్చిన సువార్తను బోధించగా, మార్గములోనే, ప్రయాణము చేయుచున్నప్పుడే అతడు బాప్తిస్మము పొందెను. క్రీస్తు సంఘ సభ్యుడాయెను అని సోదరులు హెచ్చరించిరి.

దుళ్ల క్రీస్తు సంఘ సువార్తికులు దేవరపల్లి వరప్రసాద్ గారు వందన సమర్పణ చేయగా సోదరులు సి.హెచ్. జాన్‌బాబ్ గారి ప్రార్ధనతో సువార్తికుల సదస్సు ఆనంద దాయకముగా ముగించబడెను. సోదరులు వరప్రసాద్ గారు, స్థానిక సంఘము వచ్చిన వారికి చక్కటి భోజన పానీయాల నేర్పాటు చేసిరి. సదస్సు అనంతరము 12మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications , Kakinada - 533 004.

PRINTED BOOK - BOOK POST

From:
SATYA WAKKU
P.o. Box 80
KAKINADA - 533 001

To